# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha @TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

మంగళవారం 1-8-2023





హబ్సిగూడ, హసన్‌నగర్‌లలో

## అగ్ని ప్రమాదాలు

**హైదరాబాద్, ఆగస్ట్ 2 (తెలుగుప్రభ):**

నగరంలోని హబ్సిగూడలో దాదాపుగా ఈరోజు ఉదయం 7.30 గంటల సమయంలో ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం జరిగింది. కాంప్లెక్స్ రెండో అంతస్తులోని అన్ లిమిటెడ్ షోరూమ్, మూడో అంతస్తులోని రెస్టారెంట్‌లో మంటలు అంటుకున్నాయి. రెండు అంతస్తులూ పూర్తిగా కాలిపోయాయి. పక్కనే పెట్రోలు బంకు ఉండటంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. స్థానికుల నుంచి అందిన సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, జీహెచ్ఎంసీ ఈవీడీఎం డీఆర్ఎఫ్ బృందాలతో కలిసి మూడు ఫైరింజన్లను వినియోగించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చునని భావిస్తున్నారు. భారీ ఆస్తినష్టం జరిగింది. అగ్నిప్రమాదంతో అక్కడ ట్రాఫిక్ జామ్ అయింది.

**హసన్‌నగర్‌లోనూ..**

అత్తాపూర్ హసన్‌నగర్‌లోనూ దుస్తుల గోడౌన్‌లో అగ్నిప్రమాదం జరిగింది. పరిసరాల్లో దట్టమైన పొగలతో స్థానికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు పరిసరాల్లోని ఇళ్లకు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు.




## గ్రూప్ — 1 ప్రిలిమ్స్ కీ విడుదల

**హైదరాబాద్, ఆగస్ట్2 (తెలుగుప్రభ):**

గ్రూప్ – 1 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రిలిమ్స్ తుది కీ విడుదలైంది. ఈ కీ వివరాల్ని టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో ఉంచింది. ప్రశ్నాపత్రంలోని ఎనిమిది ప్రశ్నలను తొలగించడంతోపాటు తొలుత విడుదల చేసిన ప్రాథమిక కీలోని రెండు ప్రశ్నల సమాధానాలను మార్చింది. మాస్టర్ ప్రశ్నాపత్రంలోని 3, 4, 5, 46, 54, 114, 128, 135 ప్రశ్నల్ని తొలగించింది. 38వ ప్రశ్నకు ప్రాథమిక కీలో సమాధానం 3గా ఉండగా, దాన్ని 2గా సవరించింది. అలాగే 59వ ప్రశ్న సమాధానం 1బదులు 3కు మారింది. ప్రాథమిక కీని జూన్ 28న విడుదల చేయగా, జూలై 1నుంచి 5వ తేదీవరకు అభ్యంతరాలు స్వీకరించింది. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని తుది కీని విడుదల చేసింది. ఫైనల్ కీయే అంతిమమని,ఇక ఎలాంటి మార్పుచేర్పులకు తావులేదని కమిషన్ స్పష్టం చేసింది.

## మానసిక ఆరోగ్యం తగ్గడం లేదని కొడుకును చంపి..


తట్టుకోలేక తల్లిదండ్రులు సైతం..

కన్యాకుమారిలో గుండెలు పిండేసే దృశ్యం

**చెన్నయ్, ఆగస్ట్ 2(తెలుగుప్రభ):**

తమ కుమారుడి మానసిక అనారోగ్యం తగ్గేది కాదని తెలిసి తట్టుకోలేని దంపతులు కొడుకును కడతేర్చి తాము కూడా ఆత్మహత్య చేసుకున్న గుండెలు హృదయవిదారక ఘటన తమిళనాడు రాష్ట్రంలోని కన్యాకుమారిలో చోటు చేసుకుంది. మురళీధరన్, శైలజ దంపతులకు ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు.మురళీధరన్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. మంచి ఉద్యోగం. ఇటీవలే కొత్త ఇంట్లోకి గృహప్రవేశం కూడా చేశారు. తమ కొడుక్కి ఉన్న మానసిన అనారోగ్యం జీవితాంతం తగ్గేది కాదని తెలియడంతో తట్టుకోలేకపోయారు. జీవితాంతం బాధపడుతూ ఉండేకంటే మరణమే శరణ్యమని భావించి కాబోలు రాత్రి పడుకునేముందు కొడుక్కి నిద్రమాత్రలు కలిపిన పాలు తాగించారు. దిండుతో అదిమిపెట్టి ఊపిరాడకుండా చేశారు. బాలుడు విగత జీవి అయ్యాక కన్నకొడుకునే చంపుకున్న ఈ జీవితాలు ఎందుకని భావించి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. గుండెలు పిండేసే విషాదం అందరినీ కంట తడి పెట్టిస్తోంది.






# సై అంటే సై..

**అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్న పార్టీలు**

**రేపే అసెంబ్లీ**

– అధికార పక్షాన్ని ఇరుకున పెట్టేలా ప్రతిపక్షాలు

– ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టేలా బీఆర్ఎస్

**హైదరాబాద్, ఆగస్ట్ 2 (తెలుగుప్రభ):**

గురువారం నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలకు అన్ని పార్టీలూ సిద్ధమవుతున్నాయి. అస్త్రశస్త్రాలతో వైరి పక్షాలను ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధమవుతున్నాయి. త్వరలోనే ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వానికి ఇవే చివరి సమావేశాలు కానున్నాయి. దీంతో ఒకరినొకరు ధీటుగా ఎదుర్కొనేందుకు.. తగిన విధంగా ఢీకొనేందుకు అన్ని పార్టీలూ తమ ఆయుధాలను సిద్ధం చేసుకుంటున్నాయి. ప్రతిపక్షాల నుంచి ఎలాంటి విమర్శలు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్ తగిన వ్యూహరచన చేసుకుంది. అధికార బీఆర్ఎస్‌ను విమర్శించేందుకు ఇవే చివరి సమావేశాలు కావడంతో శక్తియుక్తులన్నీ కూడగట్టుకునేందుకు ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు సిద్ధమవుతున్నాయి. బీఆర్ఎస్ ఇటీవలి వీఏఓల రెగ్యులరైజేషన్, ఆర్టీసీ విలీనం వంటి అంశాలతో తమ ప్రజారంజక పాలన గురించి అసెంబ్లీ వేదికగానే విస్తృత ప్రచారం చేయాలని భావిస్తోంది. అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేందుకే తమ ప్రభుత్వం పనిచేస్తోందని బలంగా చెప్పనుంది. వరదల అంశాలకు సంబంధించి ప్రతిపక్షాలు ఎలాగూ రాద్ధాంతం చేస్తాయని తెలిసి అదుకనుగుణంగా తమ ప్రణాళికను అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఓవైపు ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడమే కాకుండా.. అసలు ప్రతిపక్షాలకు ప్రశ్నించే అవకాశమే లేకుండా ఉచిత విద్యుత్ గురించి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్‌పై దాడి చేసే యోచనలో ఉంది.బీజేపీ జోక్యంతోనే గవర్నర్ బిల్లులను తిప్పిపంపారని బీజేపీపై విరుచుకుపడే అవకాశం ఉంది. ఇర ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలు ఎప్పటి లాగే ప్రభుత్వ ఎన్నికల హామీలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని భావిస్తున్నాయి. రైతులకు రుణమాఫీ, దళితబంధు, ఎస్సీలకు మూడెకరాల భూమి, పేదలకు రెండు లక్షల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ, ఉద్యోగాల భర్తీ, వరదబాధితులకు సహాయం, ఉద్యోగాల నియామక పరీక్షల్లో వైఫల్యాలు తదితర అంశాలపై చర్చకు పట్టుబట్టనున్నాయి. ఓవైపు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసి ప్రజల మరణాలతోపాటు తీవ్ర నష్టం జరిగిన ప్రాంతాల్లో బీఆర్ఎస్ అధ్యక్షుడు కానీ, కార్యనిర్వాహక అధ్యక్షుడు కానీ కనీసం పర్యటించలేదని విమర్శించనున్నాయి. వాతావరణశాఖ హెచ్చరికలున్నప్పటికీ, ప్రభుత్వం తగిన విధంగా జాగ్రత్తలు తీసుకోలేదని విమర్శించడంతోపాటు వరద బాధితులను పరామర్శించడం మాని తన రాజకీయ ప్రయోజనాల కోసం కేసీఆర్ మహారాష్ట్ర పర్యటనకు వెళ్లడాన్ని ప్రశ్నించనున్నాయి. దాదాపు ఐదువేల కోట్ల వరదనష్టం జరిగితే ప్రభుత్వం రూ.500 కోట్లు మాత్రమే కేటాయించడాన్ని తమకు అనుకూలంగా మలచుకోవాలని భావిస్తున్నాయి. మరోవైపు ఆర్టీసీ విలీనం కార్మికులపై ప్రేమతో కాదని, ఆర్టీసీ ఆస్తుల్ని అమ్ముకునేందుకు ఆటంకాల్లేకుండా చేసేందుకేనని ఆరోపించే అవకాశాలున్నాయి. మొత్తానికి చివరి సమావేశాల్లో ఒకదానితో మరొకటి ఒకరు ఢీ అంటే ఢీ అంటూ తలపడేందుకు అన్ని పార్టీలూ రెడీ అయ్యాయి.

## కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి..



**సంగారెడ్డి, ఆగస్ట్ 2 (తెలుగుప్రభ)**

ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజాదరణ ఉన్న పార్టీ వైపు నేతలు చూస్తున్నారు. అధికార పార్టీ బీఆర్ఎస్ లోకి వలసలు పెరుగుతున్నాయి. తాజాగా సంగారెడ్డి జిల్లాల సదాశివపేటకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు సదాశివపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలనేత్ర గౌడ్ సదాశివపేట బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధనుంజయ్ గౌడ్ ఆధ్వర్యంలో 100 మంది బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి మంత్రి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. ప్రతి రంగంలో తెలంగాణ నంబవర్ రాష్ట్రంగా నిలుస్తుందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో పల్లెలు తల్లడిల్లాయని, కరెంట్ లేక ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాయమాటలతో మభ్యపెడుతున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ప్రతిపక్షాలకు రాష్ట్రంలో చోటులేదని స్పష్టం చేశారు. అభివృద్ధిని చూసి ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సమచిత గౌరవం ఉంటదన్నారు.

## నేడు, రేపు తేలికపాటి వర్షాలు

**హైదరాబాద్, ఆగస్ట్2 (తెలుగుప్రభ)**



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా మారిందని తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీఎస్‌డీపీఎస్) తెలిపింది. దీని ప్రభావంతో హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో బుధ, గురువారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉన్నదని వెల్లడించింది. సోమవారం రాష్ట్రంలోని కామారెడ్డిలో అత్యధికంగా 74.8 మి.మీ, హైదరాబాద్‌లో అత్యధికంగా తిరుమలగిరిలో 57.3 మి.మీ వర్షపాతం నమోదైనట్టు తెలిపింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో రానున్న ఐదు రోజులు భారీ వర్షాలు పడనున్నాయని కేంద్ర వాతావరణశాఖ ప్రకటించింది.

ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా మారి ప్రస్తుతం బంగ్లాదేశ్ తీరంలో కేంద్రీకృతమై ఉన్నట్టు కేంద్ర వాతావరణశాఖ ప్రకటించింది. ఇది గంటకు 25 కి.మీ వేగంతో ఉత్తర వాయవ్య దిశగా కదులుతున్నదని తెలిపింది. ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు వాయవ్య భారతంలో వానలు పడే అవకాశం ఉన్నట్టు ప్రకటించింది.

# పనిచేసే.. పనికొచ్చే ప్రభుత్వమే గెలుస్తుంది

దక్షిణ భారతదేశంలో హ్యాట్రిక్ సాధించనున్న కేసీఆర్

వందేళ్ల అవసరాలకు సరిపడేలా నగరాభివృద్ధి

నోటికొచ్చినట్లు మాట్లాడే వారికి నగర ప్రజలే బుద్ధి చెప్పాలి

ఆగస్టు 15 నుంచి లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ

ఎల్‌బీనగర్‌లో ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీలో కేటీఆర్

**హైదరాబాద్, ఆగస్ట్2(తెలుగుప్రభ):**



రాజకీయాల్లో విమర్శలు, ఆరోపణలు సహజమే అయినా ఆరోపణలు ఆధారాలతో ఉండాలని,విమర్శలు సద్విమర్శలుగా ఉండాలని మునిసిపల్ మంత్రి కేటీఆర్ అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ హోదా, వయసు చూడకుండా సీఎంను ఇష్టానుసారం తిడుతున్న వారికి నగర ప్రజలే బుద్ధిచెప్పి పంపించాలని కోరారు. తద్వారానైనా అలాంటివి తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. విస్తరిస్తున్న నగర అవసరాలకనుగుణంగా యాభై,వందేళ్ల అవసరాలకు సరిపోయేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. మెట్రో మలిదశ విస్తరణల గురించి ఈ సందర్భంగా చెప్పారు. ఆగస్టు 15 నుంచి అక్టోబర్ వరకు నగరంలో లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ప్రజలకు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గానికి నాలుగువేల చొప్పున పంపిణీ చేస్తామని తెలిపారు. నియోజవర్గానికి మూడు వేల చొప్పున గృహలక్ష్మి కింద సహాయం అందజేస్తామన్నారు. అసాధ్యమనుకున్నవి సాధ్యం చేసిన ఘనత కేసీఆర్‌దేనని, ప్రస్తుతం దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రం తెలంగాణయే అన్నారు. ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. ఎన్నికలకు ముందు ఆర్నెల్లు మాత్రం రాజకీయాలుచాలునని, మిగతా నాలుగున్నరేళ్లు ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి జరగాలన్నారు. పనిచేసే..పనికొచ్చే ప్రభుత్వాన్ని ఎవరూ వదులుకోరంటూ రాబోయే ఎన్నికల్లోనూ గెలుపు బీఆర్ఎస్‌దేనని, దక్షిణ భారతదేశంలో హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ ఘనత సాధించనున్నారని ధీమా వ్యక్తం చేశారు. విశ్వనగరంగా హైదరాబాద్ రూపుదిద్దుకుంటుందన్నారు. దుర్గం చెరువు తరహాలో నగరంలో14బ్రిడ్జిలు రానున్నాయని, అవి పూర్తయ్యాక నాగోల్, ఎల్‌బీనగర్‌లలో సినిమా షూటింగ్‌లు జరుగుతాయన్నారు.



## స్కూటీని ఢీకొన్న స్కూల్ బస్సు

బాలిక మృతి

**హైదరాబాద్, ఆగస్ట్2(తెలుగుప్రభ):**

వేగంగా వచ్చిన స్కూలు బస్సు స్కూటీని ఢీకొనడంతో స్కూల్‌కు వెళ్తున్న బాలిక అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బాచుపల్లి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. కిశోర్ తమ కుమార్తె దీక్షిత(8)ను స్కూల్‌లో దింపేందుకు స్కూటీపై వెళ్తుండగా, రెడ్డిల్యాబ్స్ కంపెనీ సమీపంలో వేగంగా వచ్చిన స్కూలు బస్సు ఢీకొనడంతో వెనుక కూర్చున్న దీక్షిత స్కూటీ నుంచి కిందపడి, బస్సు పాపపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బాలిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మూడో తరగతి చదువుతున్నట్లు తెలిసింది. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో అతివేగంగా నడపడమే ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



## ‘గృహలక్ష్మి ’లో దివ్యాంగులకు రిజర్వేషన్లు

**హైదరాబాద్, ఆగస్ట్2(తెలుగుప్రభ):**

సొంత స్థలాలున్న వారు ఇళ్లు నిర్మించుకునేందుకురూ. 3లక్షల సహాయం అందించే గృహలక్ష్మి పథకంలో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన సీఎం ఆమేరకు ఆదేశాలు జారీ చేయడంతో రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాసరాజు ఉత్తర్వులు జారీ చేశారు. గృహలక్ష్మి పథకానికి సంబంధించిన మార్గదర్శకాల్లో ఎస్సీలకు 20 శాతం,ఎస్టీలకు 10శాతం, బీసీలకు 50 శాతం రిజర్వేషన్లున్నాయి. ఇప్పుడు దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు అమలుకానున్నాయి.

## ‘అమృత్‌భారత్’ తొలిదశలో 21 స్టేషన్లు

**హైదరాబాద్, ఆగస్ట్2(తెలుగుప్రభ):**

అమృత్ భారత్ పథకం కింద రైల్వేశాఖ అభివృద్ధి చేయనున్న రైల్వే స్టేషన్లలో తెలంగాణాలోని 39 రైల్వేస్టేషన్లుండగా, తొలి దశలో అభివృద్ధి చేయనున్న వాటిల్లో 21 రైల్వేస్టేషన్లున్నాయి. వీటిని రూ. 891 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. తొలిదశలోని 21 స్టేషన్లలో నాంపల్లి, నిజామాబాద్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, మహబూబాబాద్, మలక్‌పేట, మల్కాజిగిరి, ఉప్పుగూడ, హఫీజ్‌పేట, హైటెక్‌సిటీ, కరీంనగర్, రామగుండం, ఖమ్మం, మధిర, జనగామ, యాదాద్రి(రాయగిరి), ఖాజీపేట జంక్షన్, తాండూరు, భద్రాచలం రోడ్ జహీరాబాద్, ఆదిలాబాద్ స్టేషన్లున్నాయి.